# చీకటి నుంచి...

—విహారి



**మీరు** నమ్ముతారో, నమ్మరో తెలీదు గానీ—ఒక్కొక్క మనిషికీ ఒక్కొక్క సమయంలో జ్ఞానోదయం అవుతుంది.

కావాలంటే మా సుందరంనే అడగండి.

ఆ రోజు తన గురించిన సత్యం తనకి తెలిసింది అంటాడు.

నేనూ, సుందరమూ కాలేజీలో చదువుతూ ఒకే హాస్టల్లో ఉండేవాళ్ళం.

అప్పటి మాట ఇది!

ఆదివారం—

పగలు పది గంట లవుతూంది. నేను తిలక్ కవితల పుస్తకం మూసి చూసి ఒళ్ళు విరుచుకుంటూ లేచాను. గది తలుపు తీస్తుంటే బయట కారిడార్‌లో కోలాహలం వినిపించింది.

వెళ్ళి చూశాను. ఆ హడావిడి అంతా సుందరం గది ముందు.

సుందరం గదిలోకి కొత్త సభ్యుడు ప్రవేశించాడట. విశ్వం—హీరోలా, చాలా ఉత్సాహంగా సుందరంకి ఆజ్ఞలు జారీ చేస్తున్నాడు.

సుందరం గది నెంబరు 34. నేనూ, రామ్మూర్తి 31 లో ఉంటున్నాం. 35 వ నెంబరు గది విశ్వం, ప్రసాద్‌రావ్ లది.

‘‘నీ శ్రేయస్సు కోరి చెప్తున్నా నబ్బాయ్. ఆ తర్వాత నీ ఇష్టం. ఇప్పుడే పోయి వార్డెన్‌కి చెప్పు—ఈ పుచ్చొంకాయ మొహాన్ని నా గదిలో పెట్టకండని. కావాలంటే మన సైన్యమంతా రంగంలోకి దిగుతుంది. నీకు జరిగిన అన్యాయాన్ని ప్రతిఘటిస్తుంది. నా మాట వినకపోయావో—ఆనక నువ్ ఒడ్డున పడ్డ చేపపిల్ల వైపోతావ్.

మా సపోటా లేకుండా గిలగిల్లాడి పోతావ్.’’

నేను సదరు పుచ్చొంకాయ మొహం కేసి చూశాను.

గదిలో పడమర మూలగా కిటికీకి దిగువగా మోకాళ్ళమీద తల ఆనించుకుని, ముడుచుక్కూర్చున్నా డతను. తామర కాడలా జవజవ లాడిపోతున్న శరీరం, వెలిసిపోయిన పాంటూ, షర్టూ, తైల సంస్కారం లేని చింపిరి జుట్టూ.

పుస్తకాలూ, బట్టలూ కలిపి కట్టిన గుడ్డ మూట పక్కగా నేల మీద ఉంది.

విశ్వం జోక్ మీద జోక్ విసిరి జనాన్ని నవ్విస్తూ, మధ్య మధ్య సుందరానికి హెచ్చరికలు చేస్తున్నాడు.

‘‘నేను చెప్పిన మాట వినకపోతే—నేను మా వూరికి పోయి మా నాన్నగారికి మహా ఘనత వహించిన సుందరంగారి భ్రష్టత్వాన్ని గురించి—కొంచెంగా విన్నవించి వస్తాను. ఆ తర్వాత తమ అడ్రస్ కేరాఫ్ పేవ్‌మెంట్!’’

అంతా ఫక్కున నవ్వేరు.

సుందరంకి—పై ప్రాణాలు పైనే పోయినట్లయింది. క్షణం తర్వాత ప్రాణాలు మళ్ళీ తెచ్చుకున్నాడు.

చుట్టూ ఉన్న మిత్ర బృందాన్ని కలయ జూశాడు.

విశ్వం మీద దృష్టి నిలిపి ‘‘అట్లాగే’’ అని తల వంచుకున్నాడు.

‘‘మా బుజ్జి సుందరం చాలా బుద్ధిమంతుడు—నాకు తెలుసు’’ అని గోముగా అని, ‘‘వెళ్దాం పదండి. వార్డెన్ సంగతి చూద్దాం’’ అంటూ మెట్ల వైపు నడిచాడు విశ్వం. అంతా అతన్ని అనుసరించారు.

ముప్పయి నాలుగో నెంబరులో నేనూ, అతనూ మిగిలేము.

కిటికీ వారగా వెళ్ళి నిల్చున్నా న్నేను. పిచ్చుక కిచకిచ మంది. తల పైకెత్తి బయటికి చూశాను. దూరంగా చౌరస్తా కనిపిస్తోంది. అక్కణ్నుంచీ బాట వెంట నా చూపులు ప్రసరించాయి. అర ఫర్లాంగు దూరంలో ఒక సందు మెయిన్ రోడ్‌ను కలుస్తోంది. అక్కడ వూర కుక్కలు కొట్లాడుకుంటున్నాయ్. బక్క చిక్కి నీరసించిపోయిన కుక్కను మిగతా కుక్కలు తమ రాజ్యంలో దానికి ప్రవేశం లేదని తరుముతున్నాయ్.

‘‘నీ పేరు?’’ అంటూ అతనికేసి చూపులు మరల్చాను.

సరిగ్గా అదే సమయంలో అతనూ తలెత్తి నా వైపు చూశాడు. మా ఇద్దరి చూపులూ కలుసుకున్నాయి.

‘‘ప్రకాశం’’ అని చూపులు మరల్చుకున్నాడు.

సెప్టెంబర్ 20 విడుదల!

గానం కొందరినే అలరిస్తుంది. కానీ హృదయ గానం అందరినీ స్పందింపచేస్తుంది. జీవితంలో అనుభూతి, ప్రేమ, విలువ విషాదం అనేకరకాల రాగాలని తన కలంతో అతినాజూకైన బాణీలు పలికించిన............

ఆంధ్రుల ఆరాధ్య రచయిత్రి

శ్రీమతి యద్దనపూడి సులోచనారాణిగారి

సరిక్రొత్త నవల

హృదయగానం

వెల. 16.50

ఆమె మా ఇతర రచనలు

| | |
|---|---|
| దాంపత్యవనం ... 15.00 | మధురస్వప్నం ... 16.00 |
| నీరాజనం ... 16.00 | సహజీవనం ... 15.00 |
| స్నేహమయి ... 12.00 | సంసారరథం ... 10.00 |
| ఈదేశం మాకేమిచ్చింది? ... 15.00 | అనురాగ తోరణం ... 10.00 |
| రాధాకృష్ణ ... 13.00 | ప్రేమలేఖలు ... 20.00 |
| కీర్తికిరీటాలు ... 16.00 | పార్థు ... 12.00 |

అన్ని పుస్తకాలషాపులలోనూ దొరుకుతవి. లేదా ఒక రూపాయి తగ్గించి M.O. పంపండి. ఆ రూపాయికి V.P.P పంపుతాము.

...క్వాలిటీ పబ్లిషర్స్...

రామమందిరం వీధి, విజయవాడ-2

నేను ఇతర విషయాలు అడగబోతున్నాను. అతనే చెప్పసాగాడు.

"మాది విమలాపురం. నిన్ననే మా అయ్య నన్ను కాలేజీలో చేర్పించాడు. ఇవ్వాళొచ్చి హాస్టల్లో చేరమన్నారు. ఈ గది నెంబ రిచ్చారు. విశ్వంగారిదీ మా వూరే. మా అయ్య ఆళ్ళకాడ పాలేరు. మేం గూడెం మదుసులం."

ఒక మనిషి గురించి తెలుసుకోవాలంటే చాలా బొమ్మలు చూడాలని ఎక్కడో చదివాను. ప్రకాశం మాటలు వినేసరికి—అందరి విషయంలోనూ ఇది వర్తించ దనిపించింది. సమస్యని రెండు ముక్కల్లో వివరించేశాడు.

జరగబోయే రభస నా కళ్ళల్లో మెదిలింది.

వెండి చెంచాని నోట్లో పెట్టుకుని పుట్టాడు విశ్వం. అతనికి తన ప్రత్యేకతను గురించిన స్పృహ కూడా జాస్తిగానే ఉంది. ఆ స్పృహని ఎగదోయడానికి తగిన మందీ మార్బలమూ ఉంది. పుర్రెలో వంకర బుద్ధులూ ఉన్నాయి. వీటన్నిటినీ సానుకూలపరిచే రాళ్ళు—అతని జేబుల్లో దండిగా ఉన్నాయి.

నాకు ప్రకాశం మీద జాలి వేసింది.

"వార్డెనమ్మగారు రూమిచ్చారు. నా తప్పేం ఉంది, సార్, చెప్పండి?" అడిగాడు ప్రకాశం.

సాలోచనగా అతని వైపు చూస్తూ ఉండిపోయాను.

పటాలం తిరిగొచ్చింది. వార్డెన్ బయటికి పొమ్మందట. మళ్ళీ వెళ్ళాలట.

అందరూ నెమ్మదిగా అటూ ఇటూ సర్దుకున్నారు.

"కొంచెం సేపు ఉండి మళ్ళీ వెళ్దాం, నేను వస్తా" అంటూ తనూ రంగం నుంచి నిష్క్రమించాడు విశ్వం.

నేను నా గదికేసి నడుస్తూ, సుందరంని నాతో రమ్మని సైగ చేశాను. అతను నన్ననుసరించాడు.

"నీకు తెలీదని చెప్పటం కాదు గానీ" అని ప్రారంభించి, నా మనసులో మాట సుందరంకి చెప్పేశాను. రామ్మూర్తీ విన్నాడు.

"ఒకే చోట ఉంటుంటే పశువుల తోనూ, పక్షులతోనూ కూడా మనకు సావాసం ఏర్పడుతుంది. అట్లాంటప్పుడు ప్రకాశం లాంటబ్బాయ్ మనతో ఉండటంలో అభ్యంతరం ఎందుకు? నువ్వాలోచించు.

"మనం చదువు నిమిత్తం వచ్చాం ఇక్కడికి. చదువు మన బుద్ధిని వికసింపచేయాలి కానీ, ఇట్టా మరొకర్ని బాధించకూడదు. ఏమంటావ్?"

సుందరం ఏమీ అనలేదు. నేను చెప్పిన వన్నీ విని, నిమ్మళంగా వెళ్ళిపోయాడు. రామ్మూర్తీ, నేనూ ఒకరి మొహా లొకరు చూసుకున్నాం.

మధ్యాహ్నం రెండు గంటలకి వ్యవహారం తేలింది.

విశ్వం విజయలక్ష్మిని వరించి జై కొట్టించుకున్నాడు.

ప్రకాశం ఒక్కడికీ వేరుగా రూమ్ నెంబర్ 120 ఇవ్వబడింది. హాస్టల్లో చివరి గది అది. దాన్ని ఆనుకుని మరుగుదొడ్లు, ఆ పక్కగా మైదానం, దానికి ఆవలగా శ్మశానం. వీటన్నిటికీ మించి ఆ గది ఎవ్వరికీ పనికిరానిది!

ఆ మర్నాడే నేను గ్రహించగలిగాను—ప్రకాశం మనస్సులో విషం పూసిన బాణం గుచ్చుకుందని.

మెస్‌లో ప్రకాశం సీటు టేబుల్‌కి వో చివరగా స్థిరపడిపోయింది. అప్పుడతను నాకేసి చూసిన చూపులు గుండెకి సూటిగా తగిలినాయి నాకు.

నా ఆలోచనల్లో చోటు చేసుకుని వేధించడం మొదలెట్టాడు ప్రకాశం. పోనీ నేనే గది మారి అతనికి తోడుగా 120 లోకి వెళ్తానని అడిగి చూశాను. ఒప్పుకోలేదు. అది సింగిల్ రూమ్ అని సమాధానం వచ్చింది. నా మిత్రుల్లో కొందరిని అడిగి చూశాను—నేను 120 లోకి వెళ్తాను. మీ రూమ్‌లోకి ప్రకాశం వస్తాడు అని. "మంచో, చెడో విశ్వం చెప్పిన మాట విను, బ్రదర్! వాడితో మేం పేచీ తెచ్చుకోం" అన్నారు.

నాకు తేలు కుట్టినట్టయింది.

రాత్రి తొమ్మిది దవుతూండగా సుందరం గదికి వెళ్ళాను. అతనికి నచ్చ చెప్పాలన్న ప్రయత్నం చిలికి చిలికి గాలి వాన అయింది. మాటా మాటా అనుకున్నాం. కోపంతో నేనే తూలి మాట్లాడాను.

"ఆ విశ్వంగాడి మోచేతి కింది నీళ్ళు తాగుతూ బతకడం కంటే నీళ్ళు లేని బావిలో దూకి చావడం మేలు.

"నీ బ్రాహ్మణ్యం మండినట్లే ఉంది. ఓ అంటే ఢం రాదు, కులాల గురించి వాడిచ్చే లెక్చర్లకి నీ వత్తాసు.

"నువ్ చేసిన పనికి నువ్ తప్పకుండా పశ్చాత్తాప పడతావ్ చూడు."

—ఇలాంటివన్నీ అన్నాను.

సుందరం చివరికి నాకు బాగా బుద్ధి చెప్పాడు, "నీ అభ్యుదయ భావాలూ, లెక్చర్లూ నా కొద్దు లేరా. నన్నిట్టా ఉండనీ. మా నాన్న గుళ్ళో పురాణం చెప్తాడు. పండితుడు. చుట్టు పక్కల పది పల్లెలకి ఆయన గురువు.

ఆయనకి భ్రమ్మ పట్టించలేను. విశ్వం చెప్పింది నాకు సబబుగానే తోచింది."

ఆది విన్నాను. బయట పడ్డాను.

ఆ సంవత్సరమంతా ప్రకాశం మా హాస్టల్లో ప్రతి అంశానికీ టార్గెట్ అయిపోయాడు. విశ్వం అండ్ కంపెనీ చాలా చాలా చేశారు—అతనికి. పింజేరు మొహం, చి. చొ. వ. (చిరిగిన చొక్కాల వరాహం), శ్రీమాన్ వన్ ట్వంటీ—వంటి చాలా బిరుదుల్ని పొందా డతను. తెల్ల కాగితం లాంటి అతని మనస్సు మీద అంతా కలిసి సిరా ముద్దలు ముద్దలుగా ఒలకబోశారు.

నలుగురితో కూర్చోడానికి లేకుండా, నవ్వడానికి లేకుండా, నలుగురిలో నిలబడేందుకు లేకుండా—అవమానాలతో—ఏడేడు సంద్రాల దూరాన్ని కొలుస్తూ రోజులు గడపడానికి అలవాటు పడ్డాడు ప్రకాశం.

ఒక రోజు—

కాలేజీలో ఒక అగ్ని పర్వతం పేలింది. ప్రిన్సిపాల్ గదిలో విచారణ మొదలైంది. ముద్దాయి—ప్రకాశం. అతను శీల అనే అమ్మాయికి ప్రేమ లేఖ రాశాడు. ఆమెకి అసలే అగ్గి బరాటా అనే పేరుంది. ప్రకాశం ముందు ఒక ఉత్తరాన్ని, ఒక చిరిగిన పుస్తకాన్ని పడేసి దీనికి ఏ సమాధానం ఏమిటన్నారు ప్రిన్సిపాల్. ప్రకాశం తన కేమీ తెలీదన్నాడు. ప్రిన్సిపాల్‌కి చిర్రెత్తు కొచ్చింది. అచ్చు పుస్తకంలో అక్కడక్కడా మాటల్ని చించి వాటన్నింటినీ వేరే కాగితం మీద అంటించి తయారుచేసిన ఉత్తరం అది. వ్రాసింది శీలకి, రాసినవాడు ప్రకాశం, పుస్తకం అతనిది!

ప్రకాశంని డిబార్ చేశారు!

ఆ రాత్రి—బాగా పొద్దుపోయిన తర్వాత అతని గదికి వెళ్ళాను. కిటికీ దగ్గరగా నిలబడి దూరంగా స్మశానంలో కాలుతున్న శవాన్ని చూస్తున్నా డతను.

సన్నగా దగ్గి, "అయాం వెరీ సారీ" అన్నాను.

అతను ఆదోలా నవ్వాడు. "కొండ చిలువ నోట్లో చిక్కిన బక్క ప్రాణి పని ఎప్పుడూ ఇంతే. ఇందులో బాధ పడాల్సిందేం లేదు" అన్నాడు.

"మరి ఆ ఉత్తరం, పుస్తకం..." అని నేను అర్ధోక్తిలో ఆపితే—పక్కకి తిరిగి, "పరిస్థితులూ, పరిసరాలూ నా నేరాన్ని బుజువు చేశాయి గదా" అని పూరుకున్నాడు.

మరో కొద్ది సేపు కూర్చున్నాను. రాబోతుంటే అన్నాడు—"మా నాన్న పొట్ట కూటి కోసం బయటి వాళ్ళ పొలం కౌలుకి తీసుకున్నాడు లెండి. ఈ మాత్రం శాస్త్రి జరక్కపోతే ఎట్లా మరి!"

గదికి పోయి అత నన్న మాటల్ని తిరిగ్గా నెమరేసుకుంటే గానీ—"ఈ కన్నీటి కైఫీయత్తులు ఎవరి దగ్గర ఉన్నాయో" అర్థం కాలేదు!

• • •

మూడో సంవత్సరం మధ్యలో—

సుందరం తీవ్రమైన అస్వస్థతకి లోనయ్యాడు. పదిహేను రోజులకి గానీ జ్వరం తగ్గలేదు. మనిషి పాలిపోయి, చిక్కి శల్యమైనాడు. కొన్నాళ్ళు విశ్రాంతి కోసం ఇంటికి పొమ్మన్నారు ప్రిన్సిపాల్. తనకు తోడుగా వాళ్ళ వూరికి నన్నూ రమ్మన్నాడు సుందరం.

వాళ్ళ నాన్న—శివయ్యగారు—తల వాకిట కూర్చుని పిల్లలకి పాఠాలు చెప్తున్నారు. ఆయన తొడ మీద ఆరేడేళ్ళ చిన్న పిల్లవాడు. వాడి చెయ్యి పట్టుకుని అక్షరాలు దిద్దబెడుతున్నారు ఆయన. మమ్మల్ని చూసి ఆ పూట కార్యక్రమం పూర్తి చేశారు. పిల్లలంతా బిల బిలమంటూ వెళ్ళిపోయారు.

కుశల ప్రశ్నలూ, నా పరిచయమూ అయినాయి. సుందరం తల్లి కూడ ఒకసారి బయటకు వచ్చి మాతో మాట్లాడి వెళ్ళింది.

భోజనాలకి లేచాము.

ఒక వరుసలో వేసి ఉన్నాయి విస్తళ్ళు. శివయ్యగారికి వో పక్కన నేను. నా పక్కగా సుందరం. ఆయనకు మరో పక్కన ఇందాక అక్షరాలు దిద్దుకుంటున్న పిల్లవాడు.

నాతోపాటు సుందరం కూడా ఆ పిల్లవాడికేసి ఎగా దిగా చూడసాగాడు. శివయ్యగారు మా ఇద్దరి ఆలోచనలూ పసిగట్టారల్లే ఉంది. చెప్పారు—"ఈ అబ్బాయ్ మన గూడెం సుబ్బయ్య మనవడురా. ఈ మధ్య సుబ్బయ్య పోయాడు. నేనే వీణ్ణిక్కడికి తీసికొచ్చాను—నాలుగు అక్షర ముక్కలు నేర్పుతున్నాను."

శివయ్యగారి ఫాల భాగం సూర్యునిలా వెలుగుతోంది.

సుందరం కేసి చూశాను. అతనికి విద్యుల్లతను పట్టుకున్నట్టూ, బుద్ధినీ, గుండెనూ—ఒక కుదుపు కుదిపినట్లూ అయిందని అర్థం చేసుకున్నాడు.

నా అభిప్రాయాన్ని నిజం చేస్తూ ఆ రాత్రి నా ముందు ఆత్మ క్షాళనం చేసుకున్నాడు సుందరం. ప్రేమ లేఖ రహస్యం తెలిసింది నాకు. ★

19వ వార్షికోత్సవాల

ఇతిహాస లహరి
ఉపన్యాస మంజరి-పుస్తక ప్రచురణ

ప్రసిద్ధ గ్రంథములు

శివభారతము, రాణాప్రతాపసింహ చరిత్రము, ఆంధ్ర పురాణము, పోతన చరిత్రము, ఝాన్సీ రాణీ, వందేమాతరం - లను గూర్చి డా॥ ప్రసాదరాయ కులపతి, డా॥ ముదిగొండ శివప్రసాద్, డా॥ జీ.వి.సుబ్రహ్మణ్యం, ఆచార్య దివాకర్ల వేంకటావధాని, డా॥ తుమ్మపూడి కోటేశ్వరరావు, డా॥ అక్కిరాజు రమాపతి రావు (మంజుశ్రీ) గారల ఉపన్యాస మంజరి

దాదాపు 150 పుటలుండే ఈ పుస్తకానికి ప్రచురణపూర్వ విరాళం: రూ॥8 మాత్రమే. ప్రచురణానంతరం వెల: రూ॥12 (పోస్టేజీ అదనం) ఒకేసారి 3 ప్రతులు పొందగోరు వారికి పోస్టేజీ ఉచితం

యువభారతి సాహితీ మిత్రులకు ప్రత్యేక సదుపాయం

కేవలం రూ॥10 లకే 'ఇతిహాస లహరి' పుస్తకంతోపాటు రూ॥4 ల విలువగల యువభారతి ప్రచురణలు అదనం.

ప్రచురణ పూర్వ విరాళం పంపవలసిన ఆఖరు తేదీ: 30 నవంబరు 1982

వివరాలకు
యువభారతి
5, కింగ్స్‌వే, సికిందరాబాదు-500 003